క్లుప్తంగా

మార్కెట్‌లో అపారిశుధ్యంపై జెడ్సీ ఆగ్రహం



పరిసరాలను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం న్యూహోల్‌సేల్ మార్కెట్‌లో జోన్–5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.రాజేష్ శనివారం పర్యటించారు. మార్కెట్‌లో అపారిశుధ్యం తాండవించడంతో సిబ్బందిపై మండిపడ్డారు. పరిసరాల పరిశుభ్రతపై వర్తక సంఘం సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జోనల్ కమిషనర్ కృష్ణ పలు సూచనలు చేశారు. దుకాణదారులంతా తడిపొడి చెత్త డబ్బాలు ఏర్పాటు చేయాలని వ్యాపారులకు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ జనార్దన్‌రావు, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబు, వర్తక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు రెవెన్యూ ఉద్యోగుల సన్మానం



కలెక్టర్ మల్లికార్జునను సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

సీతంపేట: కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను విశాఖ రెవెన్యూ ఉద్యోగులు, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు త్రినాథ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ భవిత కేంద్రం వద్ద శనివారం నిర్వహించిన నిరామయ ఆరోగ్య బీమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇటీవల ఆయన ప్రారంభించిన సంజీవని నిధి–డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌లో ఉద్యోగులను భాగస్వామ్యం చేయడం, ఆ నిధితో దివ్యాంగులకు ఆరోగ్య బీమా కల్పించి, ఇటువంటి గొప్ప కార్యక్రమంలో పరోక్షంగా ఉద్యోగులను భాగస్వామ్యం చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్యామ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వర్మ, సెక్రటరీ సిహెచ్ రమేష్, ఈసీ మెంబర్లు సుధాకర్, మహేష్, కలెక్టర్ ఏవో ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేడు బీచ్‌క్లీన్ కార్యక్రమం

మహారాణిపేట : ఆదివారం ఉదయం 6 గంటల నుండి బీచ్ క్లీనింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. జన్ భాగీరథి ప్రోగ్రామ్‌లో భాగంగా భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పరిశుభ్రమైన బీచ్‌లు, కాలుష్యరహిత మహా సముద్రాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రామకృష్ణ బీచ్ నుంచి వైఎంసీఏ వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ మల్లికార్జున కోరారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

అల్లిపురం: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను టాస్క్‌ఫోర్సు పోలీసులు, టూటౌన్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 20 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటకకు చెందిన ఈ.సురేష్, ఎన్.కిరణ్‌కుమార్ అరకు నుంచి గంజాయి తీసుకొచ్చి, సౌత్ జైలురోడ్డులో టిఫిన్ చేస్తుండగా శుక్రవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు, టూటౌన్ పోలీసులు వారికి అందిన సమాచారం మేరకు వారిని సోదా చేశారు. సోదాల్లో వారి వద్ద గల రెండు బ్యాగుల్లో 20 కేజీల గంజాయిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పార్కు నిర్మించరూ..

- అధికారులను అభ్యర్థిస్తున్న రామకృష్ణానగర్ వాసులు
- హామీ ఇచ్చి మరిచిపోయిన అధికారులు

జనావాసాల నడుమ ఉన్న డంపింగ్ యార్డును మరో చోటుకు తరలించి అధికారులు అప్పట్లో ప్రజల మన్ననలు పొందారు. కాలుష్యం, దుర్గంధం నుంచి తమకు ముక్తి కలిగించారని ప్రజలు అధికారులను కొనియాడారు. ఆ స్థలంలో పార్కు నిర్మించి ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పడంతో ప్రజలు మరింత మురిసిపోయారు. అధికారుల తీరుకు హర్షం వ్యక్తం చేశారు. అయితే ఆనాడు అధికారులు ఇచ్చిన హామీ మాటలకే పరిమితం అయిందని ఇప్పుడు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బోర్డుకే పరిమితం అయిన ఉద్యానవనం



పార్కు నిర్మించాల్సిన స్థలం

జగదాంబ: పార్కు నిర్మాణం కలగా మిగిలిపోయిందని పాతనగర వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 39వ వార్డు పోర్టు దరి రామకృష్ణానగర్ వద్ద గతంలో డంపింగ్ యార్డు ఉండేది. అయితే దుర్వాసన, అపారిశుధ్యం నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు యార్డును మరొక చోటుకు మార్చారు. యార్డు ఉండే స్థలాన్ని శుభ్రం చేసి అక్కడ పార్కు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. దాంతో స్థానికులు తమ ప్రాంతంలో పార్కు ఏర్పాటవుతుందని ఆశ పడ్డారు. అయితే అధికారులు ఇచ్చిన హామీ మాటలకే పరిమితం అయింది. చేతల్లో కార్యరూపం దాల్చలేదని స్థానికులు వాపోతున్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకున్న రామకృష్ణానగర్‌లో అనేక మంది క్యాన్సర్ వంటి రోగాల బారిన పడి మృతి చెందుతున్నా ప్రజారోగ్యం కోసం ఆహ్లాదకర వాతావరణాన్ని జీవీఎంసీ ఇప్పటికీ ఏర్పాటు చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పొల్యూషన్ కారణంగా ఈ ప్రాంతమంతా దుమ్ము, ధూళితో నిండిపోయి ఉంటుందని చెబుతున్నారు. అయినా తమ వీధిలో ఒక్క చెట్టు అయినా నాటలేదని అంటున్నారు. గతంలో కేవలం రామకృష్ణానగర్ మాత్రమే ఇబ్బందులు ఎదుర్కొనేదని ఇప్పుడు కొత్తగా నిర్మించిన టిడ్కో ఇళ్లలో నివసిస్తున్న దాదాపు వంద కుటుంబాలు కూడా అవే బాధలు పడుతున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ హార్టీకల్చర్ అధికారులు స్పందించి వెంటనే పార్కు నిర్మాణం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమాలకు అడ్డా.. పార్కు నిర్మిస్తామన్న స్థలం ఖాళీగా ఉండిపోవడంతో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు వ్యక్తులు ఎక్కడి నుంచో వచ్చి రాత్రిళ్లు మద్యం, గంజాయి సేవిస్తున్నారు. ఈ పార్కు రౌడీషీటర్లకు అడ్డాగా మారిపోయిందని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. వారిని నిలదీసే ధైర్యం లేక అక్కడి ప్రజలు మిన్నకుండిపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం



పార్కు నిర్మించేందుకు అధికారులతో చర్చిస్తాం. కౌన్సిల్‌లో ప్రస్తావన తీసుకొచ్చి పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తాం.

–మహ్మద్ సాధిక్, 39వ వార్డు కార్పొరేటర్.

అనారోగ్యాలకు గురవుతున్నాం..



పొల్యూషన్ కోరల్లో చిక్కుకుని అనారోగ్యాల పాలవుతున్నాం. ఇప్పటికే ఇంటికి ఒకరిద్దరు చొప్పున రోగాల బారిన పడి ఉన్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా స్పందించి పార్కు నిర్మాణం చేయాలి.

–శివ, రామకృష్ణానగర్.

రారెత్తిస్తున్న ఎండలు

- ఇంటికే పరిమితమైన జనం



మధ్యాహ్నం 12 గంటలకే నిర్మానుష్యంగా మారిన అల్లిపురం మార్కెట్ రోడ్డు



నిర్మానుష్యంగా మారిన అల్లిపురం మెయిన్‌రోడ్డు

అల్లిపురం: ఎండలు మండిపోతున్నాయి. శనివారం భానుడు ప్రతాపం చూపించాడు. ఎండ తీవ్రతకు ప్రజలు బెంబేలెత్తిపోయారు. నియోజకవర్గంలో చాలా రోడ్లు కర్ఫ్యూని తలపించాయి. ఏదో ఒక పని మీద బయటికి వచ్చిన వారు చెట్టు నీడ కోసం వెంపర్లాడారు. అక్కడ కూడా నీడ తప్పితే గాలి వేడిగా రావటంతో అమ్మో ఏం ఎండ అంటూ వాపోయారు. శరీరం మంట పుట్టించింది. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడుతుందని భావించిన నగర ప్రజలకు శనివారం ఎండ బైర్లు కమ్మించింది. వేసవి తాపానికి తాళలేక గొడుగులను ఆశ్రయించారు. మూగజీవాలు విలవిల్లాడాయి. చెట్లు, మొక్కల కింద సేదతీరాయి. నగరవాసులు దాహం తీర్చుకునేందుకు కొబ్బరిబొండాలు, పండ్లరసాలు, కర్బూజా పండ్లను ఆశ్రయించారు. సాయంత్రం 4.30 గంటల నుంచి వాతావరణం చల్లబడటంతో నగర ప్రజలు కాస్త ఉపసమనం పొందారు.

‘బీజేపీ ఎంపీ, మంత్రిని అరెస్టు చేయాలి’



కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సీతమ్మధార/మహారాణిపేట : దేశానికి పేరు, ప్రతిష్టలు తెచ్చిన భారత మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను, హర్యానా మంత్రి సందీప్‌సింగ్‌ను అరెస్ట్ చేసి, పదవుల నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సంఘీభావంగా శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 28 రోజులుగా దేశ రాజధాని ఢిల్లీలో మల్లయోధులు పోరాటం చేస్తున్నా అక్కడే ఉన్న బీజేపీ ప్రభుత్వానికి చలనం లేదన్నారు. రెజ్లర్లపై ఫిర్యాదును నమోదు చేయకుండా తిరస్కరించారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం వెంటనే మల్లయోధుల సమస్య పరిష్కరించాలన్నారు. నిరసనకారులు, జర్నలిస్టులపై క్రూరమైన దాడికి పాల్పడిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. రిటైర్డ్ సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ, సీఐటీయూ కార్యదర్శి పి.మణి, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్ఎన్ రాజు, కె.సంతోష్, జోనల్ ప్రెసిడెంట్ కామేశ్వరి, ఐద్వా నాయకులు పుష్పాంజలి, కె.వేణు, వరలక్ష్మి, బి.భారతి, ఆర్.విమల, మమత, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

హార్బర్ ఆధునికీకరణకు సహకరించండి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

మహారాణిపేట : ఫిషింగ్ హార్బర్‌ను రూ. 152 కోట్లతో ఆధునీకరించేందుకు రూపొందించిన సమగ్ర ప్రణాళిక అమలుకు సహకరించాలని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను నాయకులు కోరారు. శనివారం కలెక్టరేట్‌లో హార్బర్ హైలెవల్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పోర్టు అధికారులు, మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు, మత్స్యకార సంఘాల నాయకులు వాసుపల్లి జానకీరామ్, బర్రె కొండబాబు, చింతపల్లి వీరన్న, దూడ పోలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునికీకరణకు టెండర్లు పిలిచామన్నారు. కొన్ని పనులు కూడా ప్రారంభించినట్లు తెలిపారు.

ఆర్కే బీచ్‌లో పోలీసుల ఆంక్షలు



బీచ్‌లో దుకాణాలు మూసివేయిస్తున్న పోలీసులు

అల్లిపురం: నగర పోలీసులు ఆర్కే బీచ్‌లో శనివారం రాత్రి నుంచి ఆంక్షలు విధించారు. ఇక నుంచి రాత్రి 10 గంటలు దాటిన తర్వాత బీచ్‌లో షాపులన్నీ మూసివేయాలని నగర పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమవర్మ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రాత్రి 10 గంటల నుంచి బీచ్‌రోడ్డులో దుకాణాలు దగ్గరుండి పోలీసులు మూసివేయించారు. రాత్రి సమయాల్లో నగరంలో, ముఖ్యంగా బీచ్‌రోడ్లో గొడవలకు అర్ధరాత్రి వరకు షాపులు తెరిచి వుండటమే కారణమని కొత్త ఆంక్షలు విధించినట్లు సమాచారం.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

మద్దిలపాలెం: ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 పథకం ద్వారా పిఠాపురం కాలనీలోని జన శిక్షణ సంస్థాన్‌లో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇస్తున్నామనిడైరెక్టర్ సి.హెచ్.అప్పలనాయుడు తెలిపారు. నైపుణ్యం, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ద్వారా మహిళల స్వయం ఉపాధి పొందే విధంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. అలాగే ముస్లిం తాటిచెట్లపాలెం, మల్కాపురం, అనకాపల్లి కేంద్రాలుగా శిక్షణ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 15 నుంచి 45 ఏళ్లలోపు మహిళలు శిక్షణ పొందడానికి అర్హులని తెలిపారు. నైపుణ్యం గల యువతరాన్ని తయారు చేయాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ ఈ కార్యక్రమం ప్రారంభించారని చెప్పారు.

సమ్మె వాయిదా

అల్లిపురం: జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ అర్ధ రాత్రి నుంచి చేపట్టనున్న సమ్మె వాయిదా వేసినట్లు యూనియన్ అధ్యక్షుడు వీవీ వామనరావు, ప్రధాన కార్యదర్శి జి.నరసింగరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన విస్తృత సమావేశంలో అమరావతి జేఏసీ నాయకులు బొప్పరాజు వెంకటేశ్వర్లు త్వరలోనే రాష్ట్ర స్థాయిలో ఒక కార్యాచరణ ఉంటుందని, ఆ పోరాటంలో యూనియన్ సహకారం తీసుకుంటామని తెలియజేయటంతో సమ్మెను వాయిదా వేసినట్లు వారు పేర్కొన్నారు. జీవీఎంసీ ఉద్యోగ సంఘాల నాయకులతోను, రాష్ట్ర సంఘాల నాయకులతో చర్చించి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని వారు తెలిపారు.

ఫైనల్స్‌కు ప్రసాద్, లోహిత్, దిగ్విజయ్‌లు

విశాఖ స్పోర్ట్స్ : మెన్ యూత్ స్టేట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ బాంటమ్ వెయిట్ ఫైనల్ బౌట్‌లో అనంతపురానికి చెందిన వి.పవన్‌తో స్థానిక బాక్సర్ పి.ప్రసాద్ తలపడనున్నాడు. మినిమం వెయిట్‌లో ఎస్.తేజశ్వర్‌తో పి.వాసుదేవ పాత్రుడు ఫైనల్‌లో తలపడనున్నాడు. ఫ్లైవెయిట్ 48–51కేజీల్లో స్థానిక బాక్సర్ కె.లోహిత్‌తో చిత్తూరుకు చెందిన ఎం.మున్నా తలపడనున్నాడు. విశాఖలోని రైల్వే బాక్సింగ్ హాల్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో భాగంగా శనివారం పలు వెయిట్ కేటగిరిల్లో మెన్ సెమీస్ పోటీలు జరిగాయి. ఆదివారం జరిగే ఫైనల్‌లో ఫెదర్‌వెయిట్ 54–57కేజీల్లో స్థానిక బాక్సర్ బాలగణేష్‌తో శ్రీకాకుళానికి చెందిన వి.మధు తలపడనున్నాడు. లైట్‌వెయిట్ 57–60కేజీల్లో పి.దిగ్విజయ్‌తో నెల్లూరుకు చెందిన జె.వాసు తలపడనుండగా లైట్ వెల్టర్ 60–63.5 కేజీల వెయిట్‌లో ఆసిఫ్‌తో జె.భానుప్రకాష్, వెల్టర్‌3.5–67కేజీల వెయిట్‌లో ఎన్.దిలీప్‌కుమార్‌తో ఎన్.హర్షవర్ధన్ పోటీపడనున్నాడు. లైట్‌మిడిల్ 67–71కేజీల వెయిట్‌లో బి.తృణతో వై.ప్రభువర్ధన్, మిడిల్ 71–75కేజీల వెయిట్‌లో ఎస్.మోహన్‌రావుతో ఎ.అశోక్‌కుమార్ తలపడనున్నాడు. లైట్ హెవీ వెయిట్‌లో కె.దుర్గాప్రసాద్‌తో ఆయూష్ పూర్తి, క్రూజియర్ వెయిట్‌లో కె.రామ్‌తో పి.దేవ్‌కుమార్ తలపడనున్నారు. ఆదివారం మెన్ ఫైనల్స్‌తో పాటు టోర్నీలో భాగంగా వుమెన్ బౌట్స్ నిర్వహించనున్నారు.

రాణించిన యశ్వంత్, చంటి

విశాఖ స్పోర్ట్స్ : వీడీసీఏ డివిజన్ లీగ్‌లో భాగంగా మూడో డివిజన్‌లో జరిగిన పోటీల్లో యశ్వంత్, చంటి రాణించి జట్టుకు విజయాన్నందించారు. వైఎస్ఆర్ స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో సోలో సీసీతో తలపడిన సిటీసీసీ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి 264 పరుగులకు ఆలౌటైంది. యశ్వంత్ (107)సెంచరీ నమోదు చేయగా వరుణ్ 77 పరుగులు చేశాడు. ప్రతిగా సోలోసీసీ 185 పరుగులకే ఆలౌటైంది. చంటి 44 పరుగులిచ్చి ఐదు వికెట్లు తీశాడు.

వ్యక్తిత్వ వికాసం అవసరం



మాట్లాడుతున్న ద్వారకానాథ్

మురళీనగర్: నేటి యువత మనుగడ సాధించాలంటే వ్యక్తిత్వ వికాసం అవసరమని వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి కె.ద్వారకానాథ్ అన్నారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో శనివారం ముగిసిన వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండు వేసవిలో పన్నీటిజల్లుగా ఈ తరగతులు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో నిపుణుడు డబ్బీరు రోహిత్, ఎస్.వి.ఆర్. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



వేసవి విజ్ఞాన శిబిరానికి హాజరైన విద్యార్థులు



అల్లిపురం శాఖా గ్రంథాలయంలో విద్యార్థిని ఆంగ్లభాష ప్రావీణ్యాన్ని పరిశీలిస్తున్న ఆర్‌సీహెచ్ వెంకటరావు

దాబాగార్డెన్స్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. శనివారం సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు డి. సంజీవకుమార్ పాల్గొని విద్యార్థులకు జానపద, దేశభక్తి గీతాలపనపై శిక్షణ ఇవ్వడంతో పాటు పుస్తక సమీక్ష చేయడం పట్ల అవగాహన కల్పించారు. విద్యార్థులు వారు చదివిన పుస్తకాలు సమీక్ష చేశారు. ప్రతి రోజూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందింపజేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ముగింపు వేడుకల్లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని జిల్లా కేంద్ర గ్రంథాలయాధికారి రాజేంద్రవర్మ తెలిపారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి

అల్లిపురం: విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు కోరారు. మేధో విజ్ఞానానికి, పోటీ పరీక్షలకు కావాల్సిన ఇంగ్లీషు, తెలుగు పుస్తకాలు లభిస్తాయని పేర్కొన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆయన శనివారం అల్లిపురం శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. రిసోర్స్‌పర్సన్, ఆంగ్ల ఉపాధ్యాయురాలు సునీత నాయక్ విద్యార్థులకు ఆంగ్లంలో అనర్గళంగా ఎలా మాట్లాడాలో అవగాహన కల్పించారు. అనంతరం గ్రంథాలయ కార్యదర్శి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల శాఖా గ్రంథాలయంలో..

విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు శనివారం బాలల శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆయన బాలలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పుస్తకాలు చదవడం, దేశ నాయకులు జీవిత చరిత్రలు తెలుసుకోవడం చేయాలన్నారు. ఈ సందర్భంగా తెలుగు టీచర్ కె.జయంతి, ప్రథమ ఇనిస్టిట్యూట్ ఉపాధ్యాయురాలు జి.అనురాధ విద్యార్థులకు కథలు వినిపించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి టి.పోలిపల్లి పాల్గొన్నారు.

ఘనంగా ఎర్నిమాంబ తొలేళ్ల సంబరం



ఎర్నిమాంబ ఘటాలతో వస్తున్న భక్తులు



రథంపై ఎర్నిమాంబ ఉత్సవ విగ్రహం

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం అచ్చియ్యమ్మపేట, కాన్వెంట్ కూడలిలో గల ఎర్నిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పూర్ణా మార్కెట్ దుర్గాలమ్మ ఆలయం వద్ద ఎర్నిమాంబ అమ్మవారి ఘటాలతో బయలుదేరారు. కొబ్బరితోట, అల్లిపురం, అచ్చియ్యమ్మపేట, రైల్వేస్టేషన్, కాన్వెంట్ కూడలి, జ్ఞానాపురం పుట్టబంగారం వద్దకు అమ్మవారి ఘటాలను చేర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నేలవేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షించాయి. అనంతరం ఆలయం వద్ద అగ్నిగుండాలపై భక్తులు నడిచి మొక్కులు తీర్చుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దేవదాయ శాఖ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాన జాతర నిర్వహించనున్నారు.

ఉదయం 6 గంటలకే క్లాప్ వాహనాలు వెళ్లాలి



క్లాప్ వాహనాల లాగ్‌బుక్ పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్

జగదాంబ: ఉదయం 6 గంటలకే క్లాప్ వాహనాలు చెత్త సేకరణకు ఇంటింటికీ వెళ్లాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.కిశోర్ అన్నారు. శనివారం ఆయన 31వ వార్డులోని ఆంథోనీనగర్, ఎస్‌బీఐ కాలనీ, చాకలిపేట ప్రాంతాల్లో పర్యటించారు. జీవీఎంసీ లక్ష్యం దిశగా క్లాప్ వాహనాలు నిర్దేశించిన లక్ష్యంతో పని చేయాలన్నారు. శానిటరీ సెక్రటరీలు బాధ్యతగా విధులు నిర్వహిస్తూ క్లాప్ వాహనాల రాకపోకలు రికార్డు చేయాలన్నారు. రహదారులు, కాలువల్లో చెత్త ఉండకూడదన్నారు. ప్రతి ఇంట్లో మూడు రకాలు డస్ట్‌బిన్లు ఉండేలా చూడాలన్నారు. అదే విధంగా వార్డులో వాణిజ్య సముదాయలు, చిరు వ్యాపారులు కూడా తప్పకుండా బిన్లు ఉపయోగించేలా చూడాలని తెలిపారు. ఉదయాన్నే పారిశుధ్య కార్మికులతో పాటు సెక్రటరీలు కూడా విధులకు హాజరవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పూజలు



పేదలకు భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న నగర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు లక్ష్మి తదితరులు

అల్లిపురం: కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న సందర్భంగా నగర కాంగ్రెస్ నాయకులు శనివారం ఆలయాల్లో పూజలు చేశారు. కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్‌ల ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని నగర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు కె.లక్ష్మి ఆధ్వర్యంలో నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొంప గోవింద్, కార్యకర్తలు, నాయకులు పెదవాల్తేరులో గల వేంకటేశ్వరస్వామి గుడిలో, పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుల వజ్జపర్తి శ్రీనివాస్, రామదాసు, ఈశ్వరరావు, ఎల్లయ్య, శ్రీనివాసరావు, వెంకటేష్, ఆషా, దేవి, వరాలమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

రెండు రోజులు ఎల్‌ఐసీ అఖిల భారత మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ దిలీప్

దాబాగార్డెన్స్: సేవ్ ఎల్‌ఐసీ–ప్రొటెక్ట్ ఏజెంట్స్ నినాదంతో నిరంతరం పోరాడుతున్న ఎల్‌ఐసీఏవోఐ (ఎల్‌ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా) ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖలో 6వ అఖిల భారత మహాసభలు నిర్వహించనుంది. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న మహాసభలకు సంబంధించి శనివారం సిటు కార్యాలయంలో ఎల్‌ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి, 6వ అఖిల భారత మహాసభ ప్రతినిధి డాక్టర్ పీజీ దిలీప్ కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితిలో కేంద్ర ప్రభుత్వం ఎంతో పటిష్టంగా ఉన్న ఎల్‌ఐసీని ఐపీవో పేరిట ప్రైవేట్‌పరం చేసే దిశగా తీసుకెళ్లి, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే విధానాలు అవలంబిస్తోందన్నారు. దీనిలో భాగంగా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా పోరాటం చేస్తున్న కార్మిక సంఘాలకు సంఘీభావం తెలియజేస్తూ.. ఈ పోరాటంతో ఎల్‌ఐసీఏవోఐ కూడా పాల్గొంటుందని చెప్పారు. ఈ నెల 21న సౌత్ సెంట్రల్ జోన్ 5వ మహాసభ, 22, 23 తేదీల్లో 6వ అఖిల భారత మహాసభ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు ఎల్. మంజూనాథ్, ప్రధాన కార్యదర్శి పీఎల్ నరసింహారావు, కోశాధికారి జి. రవి కిషోర్, విశాఖపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి టాగూర్, ఎం. నాగరాజు, సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పాల్గొన్నారు.